# ఈ సారి ఎన్నికలలో రాప్తాడు, ధర్మవరం టిడిపివే

### కష్టసమయంలో నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు
### ఇక్కడి ఎంఎల్ఏలకు గట్టి బుద్దిన చెబుదాం
### రెండవ రోజు పర్యటనలో పరిటాల శ్రీరాం



కార్యకర్తల నుద్దేశించి మాట్లాడుతున్న పరిటాల శ్రీరాం

**బత్తలపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** వచ్చే 2024 ఎన్నికలలో రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని, ఇక్కడి ఎంఎల్ఏలకు గట్టిబుద్ది చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరాం పార్టీ శ్రేణులతో అన్నారు. గురువారం మండలంలో రెండవ రోజు పర్యటన సంజీవపురం, బత్తలపల్లి, మాల్యవంతం, గంటాపురం, ముష్టూరు, అప్పరాశ్చెరువు పంచాయితీల్లో కొనసాగించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019ఎన్నికలలో ఓటమి తరువాత ఇక్కడి నాయకుడు పార్టీని వదలి పోతే నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినా ఏ ఒక్కరు కూడా పార్టీని వీడలేదని,, స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్దులను నిలపలేని స్థితిలో వున్నారన్నారు. అటువంటి స్థితిలో చంద్రబాబునాయుడు తనకు పార్టీ బాధ్యతలు అప్పగించారన్నారు. అప్పటి నుండి తన వంతుగా కార్యకర్తలకు అండగా వుంటూ, తనపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానన్నారు. కొందరు పార్టీలోకి వచ్చేందుకు వందల కోట్లు ఇస్తామని చెబుతూ కోట్లు ఖరీదు చేసే కారుల్లో తిరుగుతున్నామని చెప్పుకుంటున్నారని, ఆ స్థాయి దిగజారుడు మాటలు తాను ఎప్పుడూ చెప్పబోనన్నారు. వచ్చే ఎన్నికల్లో ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో రెండుచోట్ల గెలిచి చూపిస్తామన్నారు. నియోజకవర్గంలో పార్టీ ఎంతబలంగా వుందో చూపించేందుకు నారా లోకేష్ పాదయాత్ర ఒక అవకాశమన్నారు. లోకేష్ పాదయాత్రకు ఎక్కువగా పార్టీ నాయకులు, కార్యకర్తలు హజరై సంఘీభావాన్ని ప్రకటించాలన్నారు. ఎంఎల్‌సి అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డికి ఓటేవేసి గెలిపించేలా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. వైకాపా పార్టీని ఓడించి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, సురేంద్ర, అమర్నాథ్‌చౌదరి, నెట్టెం రమణ, చల్లా శ్రీనివాసులు, పోతలయ్య, సుధీర్, నెట్టెం అశోక్, గోపాల్,మాల్యవంతం సర్పంచ్ దేవి, సుబ్బరాయుడు, జగ్గు, జక్కంపూటి నాగభూషణ తదితరులు వున్నారు.

## పొలంలో రైతు కుప్పకూలి మృతి



మృతిచెందిన రైతు కాటమయ్య

**బత్తలపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** వ్యవసాయం పొలంలో పనులు చేసుకుంటున్న రైతు ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందిన సంఘటన మండలంలోని పోట్లమర్రి గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం కుటుంభ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చెడిపోతుల కాటమయ్య(60) తన పొలంలో వేరుశనగ పంట సాగుచేశాడు. అంతేకాక తన పక్కనే వున్న మరోరైతు పొలంలో ఆకుకూర సాగుచేశాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం పొలంలో పనులు చేస్తుండగా వున్నట్లుండి కుప్పకూలి పడిపోయాడు. వెంటనే కుటుంభ సభ్యులు బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించేలోపునే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు కుమార్తె వున్నట్లు తెలిపారు.



కాటమయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరాం

**కాలమయ్యకు పరిటాల శ్రీరాం నివాళి:** పోట్లమర్రి గ్రామానికి చెందిన చెడిపోతుల కాటమయ్య కుప్పకూలి మృతిచెందిన విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరాం కాటమయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంభ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.

## గాయపడిన టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

**రామగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** సత్యసాయి జిల్లా రామగిరి మండలం కొండాపురం పంచాయితీ కొండాపురం గ్రామంలో టిడిపి కార్యకర్త గొల్ల బోమ్మయ్య ప్రమాదవశాత్తు చేయి విరిగిచికిత్స పొంది ఆర్థిక పరిస్థితులలో తీవ్ర ఇబ్బంది పడుతున్న సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత సహకారంతో రామగిరి మండల తెలుగు యువత ఆధ్వర్యంలో పావగడ హెల్ప్ సొసైటీ అధ్యక్షులు మానం శశికరణ్ హెల్ప్ సొసైటీ ట్రస్టు తరుపున పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షులు ఎల్.శ్రీధర్‌నాయుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి డి.పోతన్న, ఓబులపతి, స్థానిక నాయకులు బొమ్మయ్య, రవిచంద్ర, రామాంజినరెడ్డి, రమేష్, డిపి బాబు తదితరులు ఉన్నారు.

## వైభవంగా ప్రారంభమైన శ్రీ గురు సిద్ధావధూతల ఉత్సవాలు

### -నేటి రాత్రి జండా ప్రతిష్టాపన, 25న సాయంత్రం మహారథోత్సవం



ఆలయంలోని శ్రీ గరు సిద్ధావధూతల మూలవిరాట్

**ఉరవకొండ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో వెలసిన శ్రీ గురుసిద్ధావధూతల ఉత్సవాలు స్వస్తిశ్రీ శుభకృత్‌నామ సంవత్సరం పాల్గుణ శుద్ద చవితి గురువారం వైభవంగా ప్రారంభమాయ్యయి. శ్రీ గురుసిద్దప్పస్వామి ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాల్లో భాగంగా ఉదయం బిక్షాటన కార్యక్రమాలు జరిగాయి. 24న పంచమి శుక్రవారం రాత్రి రాత్రి 7 గంటలకు శ్రీ గురు అంజనదాసులవారి చిత్రపటమును లత్తవరం శ్రీరామదాసు కుమారుడు క్రిష్ణయ్య ఇంటినుండి మఠము వరకు ఊరేగింపు కొనసాగుతుంది. అదేరోజు రాత్రి జెండా ప్రతిష్టాపన అనంతరం శ్రీ భగళాముఖి అమ్మవారి పూజ, అన్నదానం అనంతరం నంది కోలాటాలతో ఖడ్గములు చెప్పుకొంటూ గంగపూజచేసి గంగాజలాన్ని తీసుకురావడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలూరు శ్రీ గురు సిద్దేశ్వరస్వామివారి జీవ సమాధి నుండి తీర్థమును జెట్టి రామాంజినేయులు కుమారుడు బసప్ప ఇంటి నుంచి తెచ్చి తెల్లవారుజామున బలి అన్నం వేసిన అనంతరం ఉత్సవం జరిపి, కార్ణీకం (భవిష్యవాణి) చెప్పడం జరుగుతుందన్నారు. 25న శనివారం శ్రీ భగళాముఖి అమ్మవారికి పూజలు చేసిన అనంతరం సాయంత్రం 4:35 గంటలకు మహారథోత్సవం జరుగుతుందని తెలిపారు.

# గొర్రెల కాపరులకు నష్టపరిహారం అందించి ఆదుకోండి

### -జిల్లా కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు ఫోన్‌చేసిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కాపరులను ఆదుకోవాలని కోరుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



మూర్ఛవ్యాధితో మృత్యువాతపడిన గొర్రెల దృశ్యం

**ఉరవకొండ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** 30 గొర్రెలు మూర్చవ్యాధితో మృత్యువాత పడటంతో నష్టపోయిన కూడేరు మండలం కలగల్ల గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు ప్రభాకర్, రామాంజినేయులు, ఆదెప్పలకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి జిల్లా కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు విన్నవించారు. గొర్రెలను మేపుకొంటూ బుధవారం రాత్రి దాదాపు 1,500 గొర్రెలతో విడపనకల్లు మండలం హావళిగి గ్రామంవద్ద కాపరులు బస చేయగా తెల్లారి చూడగా అందులో 30 గొర్రెలు మృత్యువాత పడటంతో బోరున విలపించిన వారు తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీకు ఫోన్‌చేసి విన్నవించారు. దీంతో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వెంటనే స్పందించి తొలుత పశుసంవర్థకశాఖ ఏడీ కాంతమ్మతో మాట్లాడి ఘటనా స్థలానికి వైద్యులను పంపగా గొర్రెల మృతికి మూర్చవ్యాధే కారణమని వారు నిర్ధారించారు. మిగిలిన గొర్రెలకు వ్యాధి సోకకుండా వ్యాక్సినేషన్ చేయాలని వైద్యులను ఆదేశించిన ఎమ్మెల్సీ చనిపోయిన గొర్రెలకు బీమా చేయని కారణంగా పరిహారం అందించి ఆదుకోవాలని సూచించారు. ఈ క్రమంలో విషయాన్ని జిల్లా కలెక్టర్ కేతన్ గార్గ్ దృష్టికి తీసుకెళ్లి గొర్రెల కాపరుకులకు న్యాయం చేయాలని కోరగా నివేదిక అందగానే తప్పక ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. కష్టమొచ్చిందని చెప్పగానే వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికు గొర్రెల కాపరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను సందర్శించిన మేజిస్ట్రేట్

### -విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీసిన మేజిస్ట్రేట్ ఎ.ఓంకార్
### -బాగా చదువుకొని భవిశత్తుకు బంగారుబాట వేసుకోవాలని సూచన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న మేజిస్ట్రేట్ ఎ.ఓంకార్

**ఉరవకొండ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను గురువారం ఉరవకొండ కోర్టు జూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మెన్ ఎ.ఓంకార్ సందర్శించారు. స్టేట్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మేజిస్ట్రేట్ మధ్యాన్నం పాఠశాలకు వెళ్లి అక్కడి వంటగది, స్టోర్‌రూమ్, వాష్‌రూమ్, హాస్టల్, డైనింగ్ హాల్, హాస్టల్ తదితరాలను సందర్శించి విద్యార్థుల కోసం వండిన భోజన నాణ్యతను పరిశీలించి వివిధ అంశాలపై పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశస్థకుమారితో ఆరా తీశారు. అనంతరం కాసేపు విద్యార్థులతో ముచ్చటించిన మేజిస్ట్రేట్ ఏవైనా సమస్యలు ఉన్నాయా, బాగా చదువుకొంటున్నారా అని ఆరా తీశారు. ఆటుపోట్లు ఎన్ని ఎదురైనా మొక్కవోని దీక్షతో ప్రతి ఒక్క విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివి భవిశత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రాథమిక హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొని రాణించగలుగుతారని మేజిస్ట్రేట్ సూచించారు.

## వీధి నాటకాల ద్వారా ఆరోగ్య అభియాన్ కార్యక్రమం



వీధి నాటకాల ద్వారా ఆరోగ్య అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**పావగడ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** పావగడలో సిద్దార్థ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఆరోగ్య అభియాన్ కార్యక్రమం పాడగడ తాలూకాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆయాగ్రామాలలో జిల్లాఆరోగ్య, కుటుంబ కళాయణశాఖ, తాలూకా ఆరోగ్యశాఖ సంయుక్తఆధ్వర్యంలో 2022-23సంవత్సరంలో ఫిబ్రవరిలో ఏర్పాటుచేసిన రాష్టీయ ఆరోగ్య అభియాన్ కార్యక్రమాన్ని సిద్దార్థ చారిటబుల్ ఆధ్వర్యంలో వీధి నాటకాల ద్వారా, జానపద, కళ పాటల ద్వారా సిద్దాపుర, మరదాసనపల్లి, నాగలాపురం, బి.కె.హల్లి, తిరుమణి, తదితరగ్రామ పంచాయితీల గ్రామాలలో డెంగ్యూ, చికెన్ గునియా, క్షయ, కుష్టు రోగం తదితర రోగాలపై వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగానే లసికా కార్యక్రమాన్ని గురించి కూడాప్రజలకు అర్థమయ్యేలా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిహెచ్‌ఓ తిరుపతయ్య, సురేష్, కేశవ, శివమూర్తి, రమేష్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా గ్రామ పంచాయితీల పిడిఓలు, సిద్దార్థ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి వివిఎస్.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ సిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షులుగా ఎం.వి.సందీప్‌రెడ్డి



ఎం.వి.సందీప్‌రెడ్డి

**గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** వైఎస్ఆర్ సిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షులుగా పట్టణానికి చెందిన ఎం.వి.సందీప్‌రెడ్డి ఎంపికయ్యారు. 2014 నుండి పార్టీలో క్రియాశీలకంగా ఆయన పనిచేస్తున్నారు. గతంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# కర్నాటక మద్యం స్వాధీనం

## -ఇద్దరు అరెస్ట్

**గోరంట్ల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**

కర్నాటక ప్రాంతం నుండి అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తుండగా ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఒక ఆటోతో పాటు ఒక దిచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ ఇక్బాల్‌బాష తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో కర్నాటక ప్రాంతం నుండి 288 టెట్రా ప్యాకెట్లను పెదపల్లి గ్రామానికి చెందిన నంబి సోమశేఖర్ అనే వ్యక్తి ఆటోలో తరలిస్తుండగా కాగానిపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఉదయం 11 గంటల సమయంలో బాగేపల్లి తాలూకా కొండంవారిపల్లి గ్రామానికి చెందిన లోకేష్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో 192 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పెరుమాళ్లపల్లి గ్రామ శివారులో అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా మండలంలో ఎవరైనా కర్నాటక మద్యం తరలించినా, విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# పూర్వపు విద్యార్థుల మమకారం

### -చదువుకున్న పాఠశాలలో సరస్వతి విగ్రహం ప్రతిష్ఠ



సరస్వతి విగ్రహానికి పూజలు చేసిన దృశ్యం

**గోరంట్ల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాలకు తమవంతు ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో అందరూ కలిసి 50 వేల రూపాయలతో చదువులతల్లి శ్రీసరస్వతి విగ్రహాన్ని అందించి ప్రత్యేక పూజల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గోరంట్ల మండలంలోని వానవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 అప్పటి 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు గ్రామంలోని పాఠశాలకు శ్రీసరస్వతి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజల నడుమ పాఠశాల ఆవరణలో ప్రతిష్ఠించారు. అలాగే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సర్పంచు శ్రీరాములు, సింగిల్‌విండో అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ పాల్గొని పూర్వ విద్యార్థులను అభినందించారు. చదువుకున్న పాఠశాలకు సొంత గ్రామానికి అండగా నిలబడడం అన్ని సహాయ సహకారాలు అందించడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు నందగోపాల్, సత్యనారాయణ, వేణుగోపాల్, సీతారామారావు, ఆంజనేయులు, అహ్మద్‌బాష, పాయాల వెంకటరమణ, నాగమణి, నిర్మల, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో వైకాపా శ్రేణులు నిరసన



వైకాపా కార్యకర్తలు నిరసన చేస్తున్న దృశ్యం

**గుత్తి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** ప్రభుత్వంపై కక్షకట్టి తప్పుడు కథనాలు ప్రచురిస్తూ ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించేలా కొన్ని పత్రికలు పనిగట్టుకుని పనిచేస్తున్నాయని వైకాపా నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని గాంధీచౌక్ వద్ద గురువారం వైకాపా ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాతఫోటోలు పెట్టి తప్పుడు కథనాలు ప్రచురించి అవాస్తవవార్తలతో పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ఓ దినపత్రిక ప్రతులను దహనం చేశారు. అవాస్తవాలు ప్రచురిస్తున్న పత్రికలపై హైకోర్టు సుమోటో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఆ పార్టీ పట్టణ కన్వీనర్ హుసేన్‌పీరా, గ్రామీణ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరదరాజులు, రమణ, ఖాజాఖాన్, వార్డు ఇన్‌చార్జులు సునీల్, రమేష్‌రెడ్డి, జీపు రమణ, మర్తాడ్‌అన్సర్, నాయకులు బేదల వెంకటరాముడు, మల్లయ్యయాదవ్, శంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పెద్దమారెన్న, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో బ్లాక్‌బెల్ట్ సాధించిన విద్యార్థిని కీర్తన



బ్లాక్‌బెల్ట్ సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

**గుత్తి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మార్షల్ ఆర్ట్స్‌లో అత్యంత ప్రమాణికమైన బ్లాక్‌బెల్ట్‌ను జాతీయస్థాయిలో గుత్తికి చెందిన కీర్తన సాధించింది. స్థానిక బాలగంగాధర్‌తిలక్ తైక్వాండో శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో రాణించింది. ఆమె నైపుణ్యతను గుర్తించి బ్లాక్‌బెల్ట్ ప్రకటించారు. ఆ విద్యార్థిని పోరాటపటిమను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని శిక్షకుడు సాయితేజ పేర్కొన్నారు. విద్యార్థినిని గుత్తికోట సంరక్షణ సమితి కన్వీనర్ విజయభాస్కర్‌చౌదరి, డాక్టర్ శాంతిప్రియ, కిరణ్, కృష్ణ, తదితరులు అభినందించారు.

## ఇనగలూరు చెరువు వేలం

**అగళి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఇనగలూరు చెరువులో చేపల పెంపకానికి వేలం వేయగా కోడిపల్లికి చెందిన కామరాజు సదరు వేలంను రూ.35వేలకు దక్కించుకున్నట్లు పంచాయితీ కార్యదర్శి ఫణిరాజ్, జాన్‌పాల్‌లు తెలిపారు. వేలం పాట డబ్బులను సత్వరమే చెల్లించి పంచాయితీ రషీదు తీసుకోవాలన్నారు. వలేం పాట దారుడు చెరువులో చేపలను పెంచి అమ్ముకోవచ్చన్నారు.

## నూతన ఎంపిడిఓగా నరేంద్ర కుమార్



పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఓ

**అగళి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** అగళి మండల ప్రజా పరిషత్ నూతన ఎంపిడిఓగా గురువారం పి.నరేంద్రకుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. వారు పిెందావురంలో రెగ్యులర్‌ఎంపిడి ఓగా ఉంటూ అగళి మండలానికి ఇన్‌చార్జ్ ఎంపిడిఓగా కొనసాగు తారు. పదవీ బాధ్యతలు చేపట్టిన నరేంద్ర కుమార్‌ను ప్రభాతవార్త పలకరించినప్పుడు.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. సమస్యలు ఉన్న వారు ఎంపిడిఓ కార్యాలయంలో సంప్రదిస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వీరి వెంట మాజీ ఎంపిడిఓ శ్రీనివాసరావు బాధ్యతలను నరేంద్రకుమార్‌కు అందజేశారు. సీనియర్ సహాయకులు రెహమాన్, కార్యదర్శిలు వేణు, ఫణికుమార్, వసంతకుమార్, జూనియర్ అసిస్టెంట్, విఆర్‌ఓలు, సర్వేయర్లు, నూతన ఎంపిడిఓకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పదవీ బాధ్యతలు ఇచ్చిన ఎంపిడిఓ శ్రీనివాసరావు నూతన ఎంపిడిఓను శాలువాతో సన్మానించారు.

# విద్యతోనే ఉన్నత స్థాయి


### - ఈడిగలు అన్ని రంగాల్లో రాణించాలి - ఘనగిరి ఈడిగ సంక్షేమ సంఘం సమావేశంలో పలువురు వక్తలు



మాట్లాడుతున్న చిన్నప్పయ్య

**పెనుకొండ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** ఈడిగల కులస్తుల పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పలువురు ఈడిగ కుల పెద్దలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఘనగిరి ఈడిగ సంక్షేమ సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఈడిగల కుల పెద్దలు, మాజీ జడ్పిటిసి చిన్నప్పయ్య గిరిధర్‌గౌడ్, నీళ్ల రమణ, వెంకటరమణలు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈడిగ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆశాభావం వ్యక్త చేశారు. ఐక్యమత్యంతో ఉండి మన సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ కుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు.ఏ రాజకీయ పార్టీలో ఉన్నా కులాన్ని అభివృద్ధి చేయడం కోసం పాటుపడాలన్నారు. పేనుకొండ మండల కమిటీ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. ప్రతి ఒక్కరూ కులాన్ని అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, ప్రకాష్‌గౌడ్, గోపి గౌడ్, మారుతిగౌడ్, శ్రీరాములు, అశ్వర్థప్ప, హరి, అశోక్, పార్థసారధి, సత్తి మంజు, నాగరాజు, యల్లప్ప, సాయి, అజనగౌడ్; రామచంద్ర, ఈడిగ కులస్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే శంకర్‌నారాయణ



గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ

**రొద్దం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్న కోడిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ మాజీ మండల కన్వీనర్ కాటిమ తిమ్మారెడ్డి కుమారుడు అసిస్టెంట్ లైన్ మైన్ హనుమంతరెడ్డి నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెనుకొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ హాజరై నూతన గృహంలో సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రొద్దం మండలం వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న ఎంపిపి చంద్రశేఖర్

**రొద్దం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోగిర గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గురువారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి చంద్రశేఖర్ స్థానిక సర్పంచ్ రామకృష్ణ, కన్వీనర్ బోయ తిమ్మయ్య, చిలకల రవి,స్వామి, ఎస్సీ సెల్ గంగాధర్, ఎంఆర్‌పిఎస్ రామాంజినేయులు చిన్న కంబాలప్ప, శేషు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్వింటా పప్పు శెనగకు రూ. 5,335 లు ప్రభుత్వ మద్దతు ధర

**రొద్దం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా రైతులు పండించిన పప్పు శనగ పంటకు క్వింటాకు రూ. 5,335 లు ప్రభుత్వ మద్దతు ధర కల్పించినట్లు ఏఓ నివేదిత తెలిపారు. మండలం వ్యాప్తంగా పప్పు శెనగ పంట పండించి అమ్మటానికి సిద్ధంగా ఉంచుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ నివేదిత తెలిపారు. ఈ క్రాప్ నమోదు చేసుకుని.. సీఎంఎపిపి నందు నమోదు చేయించుకున్న రైతులు మాత్రమే పండించిన పప్పు శనగ పంటను కొనుగోలు చేసుకోవటానికి అవకాశం ఉంటుందని ఏఓ నివేదిత రైతులకు సూచించారు.

## జిల్లా సాంస్కృతికి విభాగ అధ్యక్షులు జటు మారుతిరెడ్డి ఎంపిక



మారుతి రెడ్డి

**రొద్దం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాయలసీమ కో ఆర్డినేటర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు పెనుకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఆశీస్సులతో శ్రీ సత్యసాయి జిల్లా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులుగా రొద్దం మండలం పెద్ద గువ్వలపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు మాజీ సింగిల్ విండో డైరెక్టర్ శ్రీ జెట్టి మారుతి ప్రసాద్‌రెడ్డి ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సాంస్కృతికి విభాగ అధ్యక్షులు జట్టు మారుతిరెడ్డి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


## జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ దినోత్సవం



పూజలు నిర్వహిస్తున్న సర్పంచు కరుణాకర్‌గౌడ్

**గుడిబండ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రామకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్తానిక సర్పంచు కరుణాకర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ.. మా కళాశాలలో ఎలాంటి ఇబబ ందులు, అవసరం ఏర్పడినా తక్షణమే స్పందించి కళాశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని సర్పంచు కరుణాకర్‌గౌడ్‌ను కొనియాడారు. తదనంతరం కరుణాకర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అదే విధంగా ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ రామకృష్ణనాయక్ ఆధ్వర్యంలో అధ్యాపకులు నాణ్యమైన విద్యను విద్యార్థులకు బోధించేందుకు తమ వంతు కృషి చేస్తున్నారని కావున ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యను బోధిస్తున్నారని కావున ప్రైవేట్ కళాశాలలు వద్దు ప్రభుత్వ కళాశాలలు ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎల్‌కె నరసింహప్ప, ఎంపిటిసిలు వనజాశశిధర్, గుడిబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిచంద్ర, కళాశాల అధ్యాపకులు, మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు దాదులూరు పోతులయ్య స్వామి గావుల మహోత్సవం



పూజలు అందుకుంటున్న దాదులూరు పోతులయ్య స్వామి

**కనగానపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దాదులూరు గ్రామంలో వెలసిన ప్రసిద్ది చెందిన దేవాలయం పోతులయ్య స్వామి గావుల మహోత్సవం శుక్రవారం తెల్లవారు జామున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. గురువారం పోతులయ్య స్వామి, బంగారు లింగమయ్య, చెన్నకేశవస్వామికి భక్తాదులు గుడి చుట్టూ పలారబండ్లతో ప్రదక్షిణ చేయించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు భక్తాదులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

## బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు

**బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాలపై విద్యార్థినులకు చైల్డ్ వారు, ఐసిడిఎస్ వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ ఓబులపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చైల్డ్ లైన్ సిబ్బంది సుహాసినీ తెలియజేస్తూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని 18 ఏళ్లు దాటిన తరువాత వివాహాలు చేయాలని టీనేజ్‌లో అమ్మాయిలకు వివాహాలు చేయడం ద్వారా కుటుంబంపై అవగాహనలు కోల్పోవడం, చిన్న వయస్సులో ప్రెగ్నెన్సీ అవడం, తర్వాత రక్తహీనతలతో బాధపడడం పలు అనేక సమస్యలతో బాధపడవలసి వస్తుందన్నారు. ఆడ పిల్లలకు యుక్త వయస్సు (18సంవత్సరాలు) నిండు వరకు పెళ్లిళ్ల చేయరాదని, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ పద్మ, ఎంఈఓ ఓబులపతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మల్లికార్జున, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్య వతి, శాంతమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

